## క్లుప్తంగా

### తాగునీరు వృథా



ముస్తఫా జంక్షన్ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం ముస్తఫాజంక్షన్ వద్ద ఉన్న మార్కెట్ రోడ్డులో తాగునీటి పైప్‌లైను పగిలి నీరు వృథా అవుతున్న జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముస్తఫా జంక్షన్‌లో కొన్ని రోజులుగా పైప్‌లైన్ పగలడంతో నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### వైభవంగా తిరువీధి ఉత్సవం



ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న రుత్వికులు

ఉక్కునగరం : స్థానిక సెక్టార్–1లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులను రథంపై పెట్టి ఊరేగించారు. పెద్ద సంఖ్యలో హాజరైె భక్తుల సమక్షంలో జరిగిన ఊరేగింపు నమో వెంకటేశ నామంతో సాగింది. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అంతకు ముందు స్వామికి వేకువజామున ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు, హరినారాయణ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

### ఘనంగా మంగళ శాసన పాస్త్రం



దీపారాధన చేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగరంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా మంగళ శాసన పాస్త్రం జరిపించారు. వేదపండితులు మంగళ శాసన పాస్త్రం ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. సాయంత్రం మహాలక్ష్మిపూజ, అలివేలిమంగమ్మ సంకీర్తనలు పఠనం చేశారు. తరువాత సంగీత కచేరి జరిపించారు. ఈ కార్యక్రమంలో అగనంపూడి పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు.

### రెండు ఆటోలు ఢీ .. 8 మందికి గాయాలు

కూర్మన్నపాలెం : మద్యం మత్తులో ఆటోను ఢీకొట్టిన ఘటనలో మొత్తం ఎనిమిది మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్లితే ఆదివారం గాజువాక నుంచి అగనంపూడి వైపు ఒకదాని వెనుక ఒకటి ఆటోలు వెళుతున్నాయి. వెనుక ఆటో నడుపుతున్న కిల్లంపల్లి శ్రీకాంత్ మద్యం మత్తులో ముందు వెళుతున్న ఆటోను శివాజీనగర్ వద్ద బలంగా ఢీకొట్టాడు. దీంతో శ్రీకాంత్ నడుపుతున్న ఆటో బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులతో పాటు శ్రీకాంత్ కూడా గాయపడ్డాడు. ముందు ఆటోలో ముగ్గురు గాయపడ్డారు. ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనం ద్వారా వెంటనే అతనిని కేజీహెచ్‌కు తరలించారు. స్వల్పంగా గాయపడిన వారిని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇసుకేస్తే రాలని జనం

- సంక్రాంతి షాపింగ్‌లతో రద్దీగా మారిన గాజువాక



గాజువాక మెయిన్ రోడ్‌లో కొనుగోలుదారుల రద్దీ







కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణాలు

గాజువాక : సంక్రాతి పండుగ షాపింగ్‌లతో గాజువాక మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. క్రిస్మస్ షాపింగ్ పూర్తయిన అనంతరం ఈనెల మొదటివారంనుంచే సంక్రాంతి కొనుగోళ్లు మొదలైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఓ మోస్తరుగా సాగిన వ్యాపారాలు సంక్రాంతి సమీపిస్తుండటంతో జోరందుకున్నాయి. వ్యాపార సంస్థలు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో ఆదివారం కళకళలాడాయి. గాజువాకలో షోరూములు, వివిధ వ్యాపార సంస్థలు బాగా విస్తరించిన విషయం తెలిసిందే. దీంతో అన్ని వస్తువులు ఇక్కడే లభ్యమవుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు గాజువాక ప్రాంతంలో అధిక సంఖ్యలోనే నివాసముంటున్నారు. వారంతా సంక్రాంతి షాపింగ్‌ను ఇక్కడే పూర్తి చేసుకొని తమ గ్రామాలకు వెళ్లడం ఆనవాయితీ. దీంతో కొనుగోలుదార్ల రద్దీ ఆదివారం విపరీతంగా పెరిగింది. బీసీ రోడ్‌లో బంగారు దుకాణాలు కూడా కొనుగోలుదారులతో రద్దీగా మారాయి.

**ఫుట్‌పాత్ వ్యాపారానికి ఆదరణ**

రోడ్డు పక్క వ్యాపారాలకు కూడా ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. వ్యాపారులు కోల్‌కతా, చెన్నై, రాజస్థాన్, తిరుపూర్‌వంటి ప్రాంతాలనుంచి రెడీమేడ్ దుస్తులు తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. కొత్తగాజువాక నుంచి పాతగాజువాక వరకూ మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్ వ్యాపారాలు పోటాపోటీగా సాగుతున్నాయి. రోడ్డు పక్క దుకాణాలకు కూడా కొనుగోలుదారుల తాకిడి పెరగడంతో పరిస్థితి ఇసుకేసినా రాలనంతగా మారిపోయింది.

## 26న త్రిశక్తి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, పులి వెంకటరమణారెడ్డి తదితరులు

పెదగంట్యాడ: గ్రామ దేవతలను ఆరాధించడం ద్వారా ఆయా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని అయ్యన్నపాలెం గ్రామంలో ఈ నెల 24 నుంచి నల్లమారమ్మ, నూకాంబిక, పైడితల్లి (త్రిశక్తి) అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ యూత్ కమిటీ, అయ్యన్నపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు మొల్లి ఆనంద్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించను న్నారు. ఇందులో భాగంగా ఈ నెల 26న అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం పెద్దఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, బుల్లెట్ రెడ్డి, అప్పల స్వామి, రమణ, రాజు, అప్పారావు, శ్రీను, నూకరాజు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ప్రజామోదం లేదు



696వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికి పెరిగిందని, అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ప్రజామోదం లేదనడానికి ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతే ప్రత్యక్ష నిదర్శనమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఆదివారం 696వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో హెచ్.ఎమ్.ఎస్ యూనియన్ క్రాంటాక్ట్ కార్మికులు పాల్గొన్న సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గణపతిరెడ్డి, జె.రామకృష్ణ, పిట్టారెడ్డి, నందికి తాతారావు, దొమ్మేటి అప్పారావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోడీ స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. విశాఖ ఉక్కుకు భూములిచ్చిన నిర్వాసితులు దాదాపు 8500 మంది రోడ్డున పడ్డారని, వారిలో కొంతమందికి మాత్రామే కాంట్రాక్ట్ వర్కర్స్‌గా ఉపాధి లభించిందని, మిగిలిన వారి జీవితాలు అగమ్యగోచరంగా మారయాన్నరు. విశాఖ ఉక్కును అమ్మాలని చూడడం అన్యాయమని, దినికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్.ఎమ్.ఎస్ కాంట్రాక్ట్ నాయకులు జి సత్యారావు, గొడ్డి రమణ, అప్పలరాజు, హుస్సేన్, గొందేశి రమణ, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పాలవలసపై కాలుష్యం పడగ



హిందుజా పవర్ ప్లాంట్ ఎదుట ఆందోళన చేస్తున్న పాలవలస గ్రామస్తులు



యాష్‌పాండ్ నుంచి వచ్చే కాలుష్యం కారణంగా మోడు వారిని కొబ్బరిచెట్లు

- ఉపాధి ఊసెత్తని హిందుజా యాజమాన్యం
- ఆందోళనకు దిగిన గ్రామస్తులు

పెదగంట్యాడ: హిందుజా నేషనల్ పవర్ ప్లాంట్ కారణంగా తాము తీవ్రంగా నష్టపోయామని పాలవలస గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఉపాధి కల్పిస్తామని చెప్పి తమ వద్ద నుంచి పంట పొలాలు తీసుకున్నారని, కానీ ఇప్పటి వరకూ యాజమాన్యం దాని ఊసెత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా కాలుష్యం కారణంగా ఉక్కిరిబిక్కిరవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పాలవలస గ్రామస్తులు హిందుజా నేషనల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎదుట ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 300 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. పవర్ ప్లాంట్‌కోసం భూములు ఇచ్చిన తమకు ఉపాధి కల్పించలేదని ఆరోపించారు. పైగా యాష్ పాండ్ నుంచి వచ్చే దుమ్ము ధూళి కారణంగా పాడి, పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు కలుషితమయ్యాయని తెలిపారు. పచ్చని చెట్లన్నీ మోడు వారిపోయాయన్నారు. అంతేకాకుండా గాలి నుంచి వచ్చే ధూళి పీలుస్తున్నామని, దీంతో వ్యాధులు వస్తున్నాయని, ఎవరు ఎప్పుడు చనిపోతారో కూడా తెలియని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్నామన్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు రోగాలతో సతమతమవుతున్నారని తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు చేసిన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కాలుష్యం కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తమ గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తీవ్రంగా నష్టపోయామని, గతంలో దీనిపై ఎన్నో ఆందోళనలు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా మా తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హిందుజా యాజమాన్యంతో చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రజా ఉద్యమంగా ఉక్కు పోరాటం



దీక్షా శిబిరంలో కూర్చున్న మంత్రి రాజశేఖర్, నిర్వాసితులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని, దానిని ఎలా ప్రయివేటుపరం చేస్తారని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు నడుపూరు గాంధీ పార్కు ఎదుట ఆదివారం ఉదయం 8 గంటలకు 24 గంటల నిరాహారదీక్షను ప్రారంభించారు. వీరి దీక్షకు నడుపూరు గ్రామ ప్రజలు, కాంట్రాక్ట్ కార్మికులు, స్టీల్ కార్మికులు, అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్రం ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని డిమాండ్ చేశారు.

## సెల్ టవర్ నిర్మించవద్దంటూ ఆందోళన



ఆందోళన చేస్తున్న స్థానికులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని కాకతీయ పబ్లిక్ స్కూల్ సమీపంలో ఓ ప్రయివేటు సంస్థకు చెందిన సెల్ టవర్‌ను నిర్మించవద్దని స్థానికులు డిమాండ్ చేశారు. సెల్ టవర్ పనులు ఆపాలంటూ ఆదివారం మహిళలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిల భవనంపై దీనిని ఏర్పాటు చేస్తున్నారని, అది ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఒక పక్క గంగవరం పోర్టు ధూళి కారణంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నామని, సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ ధాటికి మరిన్ని ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ సుమారు 400 కుటుంబాలతో ఉంటున్నామని, అధికారులు స్పందించి వెంటనే పనులు ఆపాలని డిమాండ్ చేశారు. స్థానిక మహిళలు ఆందోళనకు దిగడంతో న్యూపోర్టు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆందోళన కారులతో మాట్లాడారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, దొడ్డి రమణ

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సహకారంతో హౌసింగ్ బోర్డు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 200 మంది రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. మరో 55 మందికి శస్త్ర చికిత్సల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, నరసింహమూర్తి, దాస్, సురేష్, దుర్గాదేవి, పత్రీదేవి, ప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



అప్పికొండ తీరంలో 1994-95 విద్యార్థులు

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.. ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అప్పికొండ తీరంలో ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు.. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా మన్నారు. వారు తమకు విద్యను బోధించిన గురువులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వుడా నూకరాజు, పెంటబాబు, కర్రి మాణిక్యం, మహ్మద్ సఫీ, నజీర్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ప్రసన్న వేంకటేశ్వరుడు



ప్రసన్న వెంకటేశ్వరునికి పొన్నఆకులతో హారతి ఇస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్న వేంకటేశ్వరునికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరునికి మంగళ శాసన పాశురం (పొన్న ఆకులతో హారతి) భక్తులు సమర్పించారు. ఆలయ పరిసరాలలో గల పలు ప్రాంతాల నుంచి భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు నారాయణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

## దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

అగనంపూడి: లుపిన్ ఫార్మా, లుపిన్ ఫౌండేషన్ సారధ్యంలో దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపటఱు. దువ్వాడ రైల్వేస్టేషన్ ఆరవణలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని 40 మంది ఉద్యోగులు తొలగించారు. దువ్వాడ రైల్వేస్టేషన్ మేనేజర్ ఎస్ఆర్‌కేరావు మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులు సహృదయంతో సేవా కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛ భారత్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

## కేంద్ర మంత్రి దృష్టికి కాలుష్య సమస్య



పోర్టు రోడ్‌లో సమస్యలను తెలుసుకొంటున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు

గాజువాక : గంగవరం పోర్టు రోడ్ వందడుగుల రోడ్ మీదుగా జాతీయ రహదారిపైకి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు తెలిపారు. ఈ రోడ్‌లోగల నివాస ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. తాము ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యను, ఎదుర్కొంటున్న వ్యాధులను ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలుష్య సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి, కాలుష్య నివారణ మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. వాహనాలను ఈ రోడ్‌లో నివారించడం కోసం పోర్టు వై జంక్షన్ నుంచి కూర్మన్నపాలెం వైపుగల జాతీయ రహదారికి ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు గూటూరు శంకరరావు, బాటా శ్రీను, నాగేశ్వరరావు, జీలకర్ర రమణ, జ్యోతి, రోహిణి, పద్మ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో టోకరా

- మిథిలాపురి వుడా కాలనీలో రూ.20 వేలు వసూలు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో భవనంపై అదనపు స్లాబు వేయాలని భావిస్తున్న ఇంటి యజమాని నుంచి ఓ వ్యక్తి జీవీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో రూ.20 వేలు వసూలు చేసి పరారయ్యాడు. దీనికి సంబంధించి బాధితుడు, మిథిలాపురి వుడా లే అవుట్స్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రిమూర్తులు రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో ఉన్న అపోలో డయాగ్నోస్టిక్స్ భవనంపై అదనపు స్లాబు వేయించాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకుని ఓ వ్యక్తి ఆయన దగ్గరకి వచ్చి తాను కొత్త బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ను అని, తన పేరు దాట్ల శ్రీనివాసరాజు అని చెప్పి నమ్మించాడు. అన్నీ చూసుకుంటానని, ఫిబ్రవరి 5 నుంచి పనులు కూడా చేసుకోమని, పైగా భవన యజమానికి చెందిన బంధువులు, మిత్రుల పేర్లు ఒకటీ రెండు చెప్పడంతో నిజమేనని నమ్మారు. రూ.30 వేలు ఇస్తే అనుమతి ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ముందుగా రూ.20 వేలు ఇచ్చారు. నగదు ఇచ్చిన తర్వాత సచివాలయ సిబ్బందిని వాకబు చేయడంతో అటువంటి పేరు గల వారు ఎవ్వరూ జీవీఎంసీలో లేరని చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు ఇస్తానని త్రిమూర్తులురాజు చెప్పారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



గోదావరి రెడ్డి వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం : గోదావరి రెడ్డి వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకొన్నారు. ఈ కార్యవర్గంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా తాడి శ్రీనివాసరెడ్డి, సెక్రటరీగా రత్నరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా అమ్మిరెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులతో గౌరవాధ్యక్షుడు డాక్టర్ బుల్లయ్యరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి గాజువాక వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

## తులసీరావుకు గౌతంరెడ్డి నివాళి

ఉక్కునగరం: ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావుకు ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి. గౌతంరెడ్డి నివాళులు అర్పించారు. ఆదివారం ఆయన యలమంచిలిలోని తులసీరావు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. తులసీరావు కుమారుడు ఆనందకుమార్, కుమార్తె రమాకుమారీలను పరామర్శించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా కురియన్‌గా ఖ్యాతి గాంచిన తులసీరావు మృతి రైతాంగానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్‌టీయూసీ నాయకులు కలిదిండి భద్రీనాథ్, వై. మస్తానప్ప, ఆర్. అనీల్ కుమార్ పాల్గొన్నారు.



తులసీరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గౌతంరెడ్డి

## యునైటెడ్ ప్యానల్‌కు పూర్తి సహకారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన జ్యోతిరావు పూలే యునైటెడ్ ప్యానల్‌కు పూర్తి సహకారం అందిస్తామని ప్రస్తుత గుర్తింపు సంఘం, జ్యోతిరావు పూలే ఫౌండర్స్ ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరమణ తెలిపారు. తమ హయాంలో ఓబీసీ ఉద్యోగుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి చేసి అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో తమపై నమ్మకం ఉంచి ఓటు వేసిన 864 మంది ఓబీసీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన యునైటెడ్ ప్యానల్ పాలకవర్గం ఓబీసీ ఉద్యోగుల కోసం మంచి కార్యక్రమాలు చేపట్టగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల కోసం చేసే కార్యక్రమాలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు.